క్లుప్తంగా

'బ్రౌన్' గ్రంథాలయానికి 500 పుస్తకాలు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మరో 500 పుస్తకాలు చేరాయి. స్థానిక ప్రకాశ్‌నగర్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఇంజనీరు మోక్షగుండెం వెంకటసుబ్బయ్య మంగళవారం తన స్వగృహంలో ఈ పుస్తకాలను బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, సిబ్బంది నీలకంఠేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకాలలో విజ్ఞాన దీపిక, తెలుగు పరిశోధన గ్రంథాలతోపాటు జిడ్డు కృష్ణమూర్తి తాత్విక గ్రంథాలు, ఒక యోగి ఆత్మకథ తదితరాలతోపాటు పలు ఆధ్యాత్మిక గ్రంథాలు ఉన్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో ఇచ్చిన హామీలకు సంబంధించి తక్షణం జీవోలు విడుదల చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షులు కేసీ.బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కె. ఈశ్వరయ్య, బి. రాజేష్, కోశాధికారి వెంకటాద్రి, నాయకులు చంద్ర పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై 16న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కోరారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, పి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -2 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వం వివిధ శాఖలలోని ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్ 2 నోటిఫికేషన్ ఇచ్చి తక్కువ సమయం ఇచ్చారని, దీంతో సిలబస్ పూర్తి కాదని పరీక్ష నెల రోజులు వాయిదా వేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వి.గంగా సురేష్ కోరారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్‌కు లేఖ రాశామన్నారు. సిలబస్ పూర్తి చేయడానికి కనీసం ఆరు నెలల సమయం పడుతుందన్నారు. గ్రూప్ 2 నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అన్ని జిల్లా కేంద్రాలలో ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,మైనార్టీ వర్గాల వారికి 45 రోజులు మాత్రమే కోచింగ్ ఇస్తున్నారని తెలిపారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికులపై సచివాలయ సెక్రటరీల వేధింపులు ఆపాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సెక్రటరీల వేధింపులు ఎక్కువయ్యాయని పలుమార్లు తెలియజేసినా సంబంధిత సెక్రటరీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న సెక్రటరీలు మరింత రెచ్చిపోతూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు సమస్యను పరిశీలించి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రంగాల కార్మిక సంఘాలు ఈనెల 16న తలపెట్టనున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం : వ్యవసాయ, ఉద్యాన రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని తమ పంట దిగుబడులను పెంచుకోవాలని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సి.రాజుపాళెంలో రైతు మేకల రాజారెడ్డి సాగు చేసిన చీని తోటను పరిశీలించారు. పంట రకం, సాగు వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. రంగాపూర్ చీనీ అంటు మొక్కలు నాటానని, మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతు చెప్పడంతో కాయ నాణ్యత కూడా బాగుందని, అలాగే ఈ పంట నీటి ఎద్దడిని తట్టుకుంటుందన్నారు. అలాగే ఈ పంట లాభదాయకంగా ఉంటుందని రైతుకు వివరించారు. అలాగే అలహాబాద్ సఫెర రకం జామ మొక్కలని పరిశీలించారు. ప్రస్తుతం జామ ధర ఆశాజనకంగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతులకు అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పథకాలను సద్వినియోగం చేసుకుని తమ పంట సాగును, అలాగే దిగుబడులను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఉద్యాన జిల్లా అధికారి మైఖేల్ రాజీవ్, ఏడీఏ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

దేవుని కడప.. ఘన చరిత

దేవర కడప నుంచి కడప షెహర్ దాకా....

కడప కల్చరల్ : రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలలో కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం ఒకటి. అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ క్షేత్రం గురించి ప్రచారంలో ఉన్న కొన్ని కథనాలతో కలిపి కడప కైఫీయత్తులలోగల 'కడప షెహర్' వృత్తాంతం విభాగం నుంచి ఆసక్తికరమైన అంశాలను సాక్షి పాఠకులకు అందిస్తున్నాం.

- దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి అటు పురాణ ప్రసిద్ధి మాత్రమేగాక కడప నగరంతోకూడా వీడదీయలేని బంధం ఉంది. దేవుని కడప ఆలయానికి సంబంధించిన ఎన్నో చారిత్రక అంశాలు కడప కైఫీయత్తులతోపాటు గెజిటీర్లలో కనిపిస్తాయి. వాటిని పరిశీలిస్తే పలు ఆసక్తికరమైన అంశాలు కనిపిస్తున్నాయి.
- కడప షెహర్ కడప నగరం ఏర్పడక ముందు కేవలం దేవర గడప పేరుతో దేవుని కడపలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం ఉండేది. ఆలయానికి ఉత్తరం వైపున పెన్నా ఒడ్డున కాపుల గ్రామం ఉండేది. తరుచూ పెన్నానదికి వరదలు వస్తుండడంతో గ్రామం కొట్టుకుపోతూ ఉండేది. శాశ్విత పరి ష్కారం కోసం వారు అక్కడి నుంచి కాస్త మిట్టగా ఉన్న దేవరగడప సమీపానికి వచ్చి అక్కడి అర్చకుల సహాయంతో గ్రామాన్ని నిర్మించుకున్నా రు. ఆ తర్వాత నవాబుల కాలంలో ప్రస్తుతం కడప నగరంగా ఉన్న ప్రాంతంలో సైనిక శిబిరాలు ఉండేవి. ఏమాత్రం సౌకర్యం లేని కారణంగా సైనికులు అసౌకర్యానికి లోనవుతూ ఉండడంతో నవాబులు దేవర గడప గ్రామంలోని బ్రాహ్మణులను ఒప్పించి వారి షరతులకు అంగీకరించి వారిలో చాలామందిని ప్రస్తుతం కడప నగరంలో ఉన్న బ్రాహ్మణవీధి ప్రాంతంలో నివసించేలా ఏర్పాట్లు చేశారు. నాటి నుంచి దేవర గడప (దేవుని కడప) తొలి కడపగా, పెన్నా ప్రవాహంలో కొట్టుకుపోయిన ప్రాంతం రెండవ కడపగా, దేవుని కడప సమీపంలో కాపులు కొత్తగా కట్టుకున్న ప్రాంతం మూడవ కడపగా, ప్రస్తుతం కడప నగరంగా ఉన్న ప్రాంతం ఏర్పడ్డాక నాల్గవ కడపగా స్థిరపడ్డాయి. కాపులు కట్టుకున్న గ్రామం పాత కడప అయింది. నగరం అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. దేవుని కడప ఆలయమే ప్రధానంగా, మిగతా మూడు కడపలు ఏర్పడ్డాయి. పెన్నా ఒడ్డున ఉండిన కడప కొట్టుకుపోగా, ప్రస్తుతం దేవునికడప, పాతకడప, కడప నగరం ఏర్పడ్డాయి.


దేవునికడప ఆలయం

నాణ్యమైన వైద్య సేవలు

వల్లూరు : ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడానికి చర్యలు చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని లేబాక గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందుబాటులో వున్న వైద్య సేవలను గురించి ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు అందిస్తున్న వైద్య సేవలను ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిందన్నారు. దీని ద్వారా పెద్ద పెద్ద జబ్బులకు సైతం కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందడానికి అవకాశం కలిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వైద్య సేవలను అందిస్తారన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా నెల నెలా క్రమం తప్పకుండా గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయన్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో డాక్టర్ వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్ ఏర్పాటుతో వైద్యం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ రమేష్, డీపీవో వెంకటరమణ, ఎంపీడీవో విజయభాస్కర్, వైద్యాధికారులు ప్రసన్న లక్ష్మి, సీహెచ్‌వో వేణుగోపాల్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వీరపునాయునిపల్లె : మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సురేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కమలాపురం : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం కమలాపురం పరిశీలకుడు, దిశ డీఎస్పీ రమాకాంత్ రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలసి పరిశీలించారు. పోలింగ్ బూత్‌లో వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా లైటింగ్, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. వీఆర్‌ఓలు, సచివాలయ సెక్రటరీలు ఆయన వెంట ఉన్నారు.

పథకాలన్నీ కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలి

కమలాపురం : రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో అమలు కావడం లేదని, ఈ పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్నే సీఎం కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మంగళవారం 3వ కౌన్సిల్ వార్డులో ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని వారు ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజలకు ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో తప్పని సరిగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వారు ప్రజలను ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, ఇర్ఫాన్, శ్రీనివాసరెడ్డి, గఫార్, జావీద్, చంద్ర ఓబుళరెడ్డి, మోనార్క్, నగేష్, దస్తగిరి, కరీం, శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అంబేడ్కర్ సర్కిల్- వై జంక్షన్, క్రిష్ణదేవరాయ సర్కిల్-గోకుల్ లాడ్జి, దేవునికడప రోడ్, మాసాపేట రోడ్, మాసాపేట జంక్షన్- మార్కెట్ యార్డు, అల్మాస్‌పేట జంక్షన్ ప్రాంతాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకూ లైటింగ్ పోల్స్, గ్రిల్స్‌ను డివైడర్‌లో ఏర్పాటు చేయాలని, వై జంక్షన్ వద్ద ప్లాంటేషన్, ఫౌంటేన్ పనులు పూర్తి చేయాలన్నారు. అన్నమయ్య జంక్షన్ వద్ద వీధి దీపాల పోల్స్ షిఫ్ట్ చేయాలన్నారు. అన్నమయ్య జంక్షన్ నుంచి క్రిష్ణా సర్కిల్ మధ్యలో ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. క్రిష్ణా సర్కిల్ వద్ద స్టోన్ కటింగ్ పనులు పూర్తి చేసి వాహనాలు సజావుగా వెళ్లేలా చూడాలన్నారు. దేవుని కడప రోడ్డులో స్లాబ్ కట్ చేసి అప్రోచ్ రోడ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

బాలికలు పట్టుదలతో చదువుకోవాలి

కడప కార్పొరేషన్: ఆడపిల్లలు బాగా చదువుకొని వారి కాళ్లపై వారు నిలబడాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ సూచించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక చెమ్ముమియ్యాపేట జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు రివిజన్ చేస్తున్నటువంటి విధానం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఉదయాన్నే లేచి కనీసం రెండు గంటలు పాఠాలను కంఠస్థం చేసుకోవాలని, కష్టతరమైన సబ్జెక్టులను పలుమార్లు రివిజన్ చేసుకోవాలన్నారు. పబ్లిక్ పరీక్షలలో ప్రశ్నలను అర్థం చేసుకొని, సరైన సమాధానాలు రాయాలన్నారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుపై ఆసక్తి కనబరచగా ఎగ్జామ్‌కు శిక్షణ ఇప్పించేలా చర్యలు చేపడుతామని ఆయన వారికి హామీ ఇచ్చారు. పదో తరగతి పరీక్షలు రాసేటప్పుడు ప్రతి పరీక్షకు ముందు పది నిముషాలు మెడిటేషన్ తప్పకుండా చేయాలని సూచించారు. విద్యార్థులంతా మంచి మార్కులతో పాస్ కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుభద్రతపై అవగాహన కలిగి ఉండాలి

వైవీయూ : రోడ్డుభద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 35వ జాతీయ రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా రోడ్డుభద్రత-ప్రజారవాణాలో మహిళల భద్రత అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భద్రత అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ప్రజా రవాణాలో మహిళలకు రహదారి భద్రత, బస్సులలో మహిళల సీట్ల ప్రాధాన్యత, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్ మాట్లాడుతూ మనం మాత్రమే రోడ్డుభద్రతపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ఎదుటివ్యక్తులు సైతం అవగాహన కలిగిఉండేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. అనంతరం రోడ్డుభద్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ లక్ష్మీప్రసన్న, ఏపీఎస్‌ఆర్‌టీసీ ఈడీ వెంకటేశ్వరరావు, దిశ ఎస్ఐ నస్రీన్, మానవత స్వచ్ఛందసేవాసంస్థ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుమంగళి పూజ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


సుమంగళి పూజల్లో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం సుమంగళిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి సహస్ర దీపాలంకరణ, విశేష అలంకారం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో 108 మంది ముత్తయిదువులతో సుమంగళి పూజ నిర్వహించారు. తర్వాత దశ హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో ఆలయ నిర్వాహకులు అమ్మవారి పూజలో ఉంచిన పసుపు, కుంకుమ, గాజులు, గంధం, పూలను కార్యక్రమానికి హాజరైన ముత్తయిదువులకు అమ్మవారి ప్రసాదంగా అందజేశారు. ఆలయ ఈఓ ఏ. శ్రీధర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

సురేష్ బాబుకు శుభాకాంక్షల వెల్లువ



మేయర్ కె. సురేష్‌బాబును అభినందిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన కడప మేయర్ కె. సురేష్ బాబుకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, త్యాగరాజు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు.

- వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, ఎస్. సుబ్బారెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, కో ఆప్షన్ సభ్యులు పత్తి రాజేశ్వరి, బండి మరియలు, కడప మార్కెట్ యార్డు డైరెక్టర్ సంపత్, చైతన్య తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి అభినందించారు.

విద్యాబోధనలో సాంకేతికతను వినియోగించుకోవాలి

వైవీయూ : విద్యార్థులకు సరళంగా అర్థమయ్యేలా బోధించడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో వర్చువల్ విధానంలో 'న్యాక్ గుర్తింపులో కొత్త సంస్కరణలు' అన్న అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సలీంబాషా మాట్లాడుతూ గుర్తింపు విధానాలపై ఏర్పాటైన రాధాకృష్ణన్ కమిటీ వివిధ రంగాల నిపుణుల అభిప్రాయాలను తీసుకుని ప్రస్తుతం ఉన్న విధానంలోని లోపాలను సరిచేసేలా, నూతన గుర్తింపు విధానాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. మరో వక్త డా. ఎం. జయలక్ష్మికృష్ణ కోయల్ సంస్కరణల గురించి సమగ్రంగా వివరించారు.

- ఆచార్య సౌదామిని మీనన్, డా. సి.వి.కృష్ణవేణి మాట్లాడుతూ కొత్త సంస్కరణలో భాగంగా తీసుకోవాల్సిన మార్పుల గురించి ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. పి. శచీదేవి, విన్నీతేజ, డా. శాలిని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రవేటు టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధను ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పోలిచెర్ల రసీద్‌లు కోరారు. ఈ విషయమై వారు మంగళవారం డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేటు, కార్పోరేట్ యాజమాన్యాలు ప్రభుత్వం నిర్ణయించిన సమయాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ సెలవుల్లో తరగతుల నిర్వహణ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమెకు నూతన డీఈఓగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైవీయూలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం


ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: యోగివేమన విశ్వ విద్యాలయం ప్రాంగణంలోని పాత ఆర్ట్స్ బ్లాక్‌లో నూతన ఆర్ఓ ప్లాంట్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్.. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య , ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్తులో తాగునీరు నిత్యం అందరికీ అందుబాటులో ఉండేలా శుద్ధ జలప్లాంటును ప్రారంభించామన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలోని 9 ఆర్ఓ ప్లాంట్‌లు ఉన్నాయని ఇది పదవది అన్నారు. దీని ఏర్పాటుకు జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) రూ.1.20 లక్షల ఆర్థిక సహకారం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ ప్రధాన ఇంజనీరు ఎం. రాజశేఖర్ రెడ్డి, ఇంజనీరు కె. రామచంద్రారెడ్డి, ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, వైవీయూ ఆచార్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌పై పార్టీల వైఖరి తెలిపాలి

కడప ఎడ్యుకేషన్: పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీల వైఖరి తెలపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. మంగళవారం సాయంత్రం కడపలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు పోస్టు కార్డుల ద్వారా తమ డిమాండ్‌ను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్, అహమ్మద్, నాయకులు గోపీనాథ్, అబ్దుల్ గని, షాపాజితుల్లా, సుజిత్‌కుమార్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ స్థాపన అనుమతికి వినతి

కడప కల్చరల్ : కడప నగరంలో మహరాష్ట్ర వీరుడు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని స్థాపించేందుకు అనుమతి ఇవ్వాలని వైఎస్సార్ జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి సట్టి భారవి కోరారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. నగరంలోని బిల్టప్ సర్కిల్‌లో శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, ఈనెల 19న ఆయన జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు.

డీఈఓకు అభినందన


డీఈఓకు పుష్పగుచ్ఛాన్ని అందచేస్తున్న ఏపీ రాయల్ అంధుల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మర్రెడ్డి అనురాధకు మంగళవారం పలు సంఘాల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఇందులో భాగంగా ఏపీ రాయల్ అంధుల సంఘం కడప జనరల్ సెక్రటరీ ప్రకాష్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి ఆకుల రాజేలు డీఈఓకు పూలగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలోని అంధుల పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీరితోపాటు ఏపీ ఫిజికల్ సైన్సు టీచర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి వెపరాల ఎబినైజర్, శ్రీనివాసరావు, మురళి, ప్రాథమిక అంధుల పాఠశాల హెడ్ టీచర్ వెంకటరమణలు పాల్గొన్నారు. వీరితోపాటు ప్రధానోపాధ్యాయుల సంఘం నేతలు కూడా కలిసి డీఈఓ అనురాధాను అభినందించారు.